నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, శుక్రవారం 9 మే 2025 HYDERABAD



భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధవాతావరణం నేపథ్యంలో నగరంలో హై అలర్ట్ కొనసాగుతున్నది. సిటీలో ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. మతపరమైన ప్రదేశాలు, ప్రార్థన మందిరాలు, ప్రభుత్వ కార్యాలయాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పోలీసు బలగాలతో పాటు ఇంటెలిజెంట్, స్పెషల్ బ్రాంచ్, డాగ్ స్క్వాడ్ తదితర విభాగాలు రంగంలోకి దిగాయి. సున్నిత మైన ప్రాంతాల్లో భద్రత మరింత కట్టుదిట్టం చేశారు. 24/7 సీసీ కెమెరాలు పనిచేసేలా మానిటరింగ్ చేస్తున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, గచ్చిబౌలి స్టేడియం, ఐటీ కారిడార్, హైటెక్ సిటీపై ప్రత్యేక నిఘా పెట్టారు.



# హై అలర్ట్

## నగరంలో భద్రత కట్టుదిట్టం

మతపరమైన ప్రదేశాలపై ప్రత్యేక నిఘా
సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలి
సిబ్బందికి ఉన్నతాధికారుల ఆదేశాలు

**సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ):**

హైదరాబాద్‌లో హై అలర్ట్ కొనసాగుతోంది. భారత్ పాక్ మధ్య పరిణామాల నేపథ్యంలో నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. కీలక స్థావరాలు, సైనిక కంటోన్మెంట్లు, ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిఘా పెంచారు. సిటీలో మతపరమైన అల్లర్లు తలెత్తకుండా ముందస్తుగా గతంలో ఇటువంటి అల్లర్లను ప్రోత్సహించిన వారిని గుర్తించి వారిపై కన్నేశారు. పాతబస్తీ, కంటోన్మెంట్, సైదాబాద్, మలక్‌పేట వంటి ప్రాంతాల్లో పోలీసు భద్రత కొనసాగుతోంది. సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వస్తున్నారు. నగరంలో సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలని, కొన్ని సున్నితమైన ప్రాంతాల్లో అనుకూలతను బట్టి ఆయాప్రాంతాల్లో స్థానికుల సహకారం తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. ఇప్పటివరకు పాకిస్థాన్ విషయంలో కొంత సానుకూలంగా స్పందించిన వారిని కూడా గుర్తించి వారిపై కూడా దృష్టిపెట్టినట్లు తెలిసింది. ప్రస్తుత పరిస్థితుల్లో నగరంలో శాంతిభద్రతలు కాపాడడంతో పాటు యుద్ధవాతావరణం తలెత్తితే ప్రజ లు తమను తాము రక్షించుకోవడం, పోలీసుల చర్యలపై ఎప్పటికప్పుడు జోనల్ ఆఫీసర్లతో సీపీ సమీక్ష నిర్వహిస్తున్నారు.

### ప్రార్థన మందిరాలపై ప్రత్యేక దృష్టి..

నగరంలోని ప్రార్థన మందిరాల వద్ద ఎలాంటి ఘర్షణ వాతావరణం తలెత్తకుండా ముందస్తుగా అన్ని ప్రాంతాల పోలీసులను అలర్ట్ చేశారు. ముఖ్యంగా మతపరమైన ప్రదేశాల చుట్టూ నిఘా పెంచారు. స్థానిక, డివిజనల్, జోనల్ స్థాయిలోని నైట్ డ్యూటీ అధికారులు రాత్రివేళల్లో తమ ఏరియాల్లోని ముఖ్యమైన ప్రార్థన ఆలయాలను సందర్శించి తనిఖీలు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. ఎక్కడైనా ఏదైనా అనుమానాస్పద వస్తువు కనిపిస్తే వెంటనే తొలగించాలని, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ముందస్తు జాగ్రత్తగా మతపరమైన స్థలానికి ఏదైనా నష్టం జరిగితే దానిని వెంటనే సరిదిద్ది అక్కడ ఎలాంటి ఘటనలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ఈ విషయంలో లోకల్ అధికారులే కీలక పాత్ర పోషించాలని, ఎప్పటికప్పుడు కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో టచ్‌లో ఉండాలని, ముఖ్యమైన సమాచారం ఉంటే క్షేత్రస్థాయి సిబ్బంది మొదలుకొని సీపీ వరకు ఎవరికైనా వెంటనే తెలిపేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గతంలో మతపరమైన అల్లర్లకు కారణమైనవారు కానీ, అందుకు ప్రేరేపించినవారు, అందులో పాల్గొన్న వారు ఎవరున్నా వారిపై నిఘా పెట్టినట్లు ఓ పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు. పోలీసులకు ప్రజలు సహకరించి వారి భాగస్వామ్యంతో ఎటువంటి పరిస్థితినైనా గట్టెక్కించగలమని ఆ అధికారి అభిప్రాయపడ్డారు.



# డ్రోన్ హబ్‌గా సిటీ

## దేశ రక్షణలో కీలక భూమిక

అధునాతన సాంకేతికతకు వేదిక
టెక్నాలజీతో శత్రువుల ఆటకట్టు
ఉగ్ర మూకలను అంతమొందించేందుకు ఉపయోగం

సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ) : యూరీ ఘటనకు బదులుగా 2016 సెప్టెంబర్‌లో భారత బలగాలు చేసిన సర్జికల్ స్ట్రయిక్‌లో డ్రోన్లు అత్యంత కీలకపాత్రను పోషించాయి. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే మానవ రహిత డ్రోన్లను పాక్ ఉగ్ర స్థావరాల్లోకి సైన్యం తీసుకెళ్లింది. డ్రోన్ల ద్వారా సేకరించిన భౌగోళిక సమాచారం ఆధారంగా సునాయాసంగా చేరుకుని, ఉగ్రమూకలను తుద ముట్టించారు. దీనికి డ్రోన్లు అందించిన సమాచారమే కీలకం కాగా, హైదరాబాద్ ఇప్పుడు రక్షణ రంగానికి అవసరమైన డ్రోన్లను అందించే వేదికగా నిలిచింది. పదుల సంఖ్యలో సిటీ కేంద్రంగా అధునాతన ఆవిష్కరణలు పురుడు పోసుకోవడంతో పాటు దేశ రక్షణలోను కీలక పాత్రను పోషించే స్థాయికి ఎదిగాయి.

### అధునాతన సాంకేతికత వినియోగం..

గడిచిన ఐదేళ్లలో తెలంగాణలో డ్రోన్ల తయారీ, వినియోగం క్రమంగా పెరుగుతుంది. ఈ క్రమంలో యూఏవీ డ్రోన్లకు రూపకల్పన చేసే హబ్‌గా హైదరాబాద్ నిలుస్తుంది. రక్షణ రంగానికి అవసరమైన అన్ని రకాలను డ్రోన్లతో వ్యూహాత్మక దాడులు చేసే స్థాయిలో అధునాతన సాంకేతికతను వినియోగిస్తున్నాయి. ఇందులో సెక్ ధ్రువాన్ ఇన్నోవేషన్ సంస్థ చేసే గాల్లో ఉండే డ్రోన్లను లక్ష్యంగా దాడులు చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అదే విధంగా గ్రేన్ రోబోటిక్ అనే సంస్థ తయారు చేసిన ఇంద్రజాల్ యాంటీ డ్రోన్ వ్యవస్థ ద్వారా విస్తృత పరిధిలో యూఏవీ కౌంటర్ అటాక్ చేయగలుగుతుంది. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా పనిచేస్తూ శత్రువు ఆయుధాలను గాల్లో కలిపిస్తుంది. ఈ అధునాతన వ్యవస్థ ద్వారా డ్రోన్ అటాక్‌లకు వజ్రకవచంలా నిలువరిస్తాయి. ఇక జేఎస్‌డబ్ల్యూ డిఫెన్స్ అనే సంస్థ అమెరికా ఆధారిత రక్షణ రంగానికి చెందిన కంపెనీతో కలిసి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో దూసుకుపోయే డ్రోన్లను ఉత్పత్తి చేస్తోంది. జెన్ టెక్, రేడాన్ సిస్టం అనే స్టార్టప్‌లు రూపొందించిన డ్రోన్ టెక్నాలజీ అన్నింటికి వైవిధ్యంగా ఉండటంతోపాటు, ఎలాంటి డ్రోన్లనైనా ముందుస్తుగానే పసిగట్టేస్తోంది. దీంతోపాటు గరుడ ఎయిరోస్పేస్ అనే సంస్థ కూడా డ్రోన్ల తయారీలో కీలకంగా వ్యవహరిస్తూ రక్షణ రంగానికి అవసరమైన ఆయుధాలను అందించే స్థాయిలో ఆవిష్కరణలలో దూసుకుపోతున్నాయి.

### శత్రు దాడులను పసిగట్టి..

దేశంలోని అన్ని మెట్రో నగరాల్లో కంటే హైదరాబాద్ ఏకో సిస్టమ్ బలోపేతంగా ఉంది. గడిచిన పదేళ్లలో తెలంగాణ వ్యాప్తంగా అందుబాటులోకి పారిశ్రామిక విధానం అధునాతన ఆవిష్కరణలకు కారణమైంది. ఇలా ఆపత్కాళంలో శత్రు మూకలను తరిమికొట్టే ఆయుధ సంపత్తిని అందించే కర్మాగారంగా నిలుస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో కార్యకలాపాలు కొనసాగించే ఎన్నో సంస్థలు అధునాతన యుద్ధ సామగ్రిని ముఖ్యంగా డ్రోన్లు, మానవరహిత గాలి వాహనాలను(యూఏవీ)లను అందుబాటులోకి తీసుకువచ్చాయి. ఈ క్రమంలో హైదరాబాద్ వేదిక ఉన్న ఎన్నో కంపెనీలు అంతర్జాతీయ సంస్థలతో కలిసి అధునాతన ఆయుధాలను అందించే స్థాయికి చేరుకున్నాయి. ఎలాంటి ప్రాణనష్టం లేకుండా శత్రు దాడులను పసిగట్టి, నియంత్రించగలిగే డ్రోన్లు కూడా హైదరాబాద్‌లో జీవం పోసుకుంటున్నాయి.

# అనుమానితులపై ప్రత్యేక నిఘా

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, గచ్చిబౌలి స్టేడియం, ఐటీ కారిడార్‌లపై స్పెషల్ ఫోకస్

**సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ):**

ఒక పక్క ప్రపంచ అందాల పోటీలు.. మరో పక్క భారత్-పాక్‌ల మధ్య యుద్ధవాతావరణం.. ఈ నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలోనే సైబరాబాద్ పోలీసులు కమిషనరేట్ పరిధిలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. భారత్-పాక్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల సందర్భంగా ముందు జాగ్రత్త చర్యగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ కారిడార్‌తో పాటు ఇతర పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య సంస్థల వద్ద నిఘా పెంచారు. నగరంలో ఉగ్రమూకలు, వాటి సానుభూతి మూలాలేమైన ఉన్నాయా అనే కోణంలో కేంద్ర, రాష్ట్ర నిఘా సంస్థలు ప్రత్యేక దృష్టి పెట్టాయి. కమిషనరేట్ పరిధిలోని సీసీ కెమెరాలన్నింటినీ 24/7 మానిటరింగ్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, తప్పుడు వార్తలు రాకుండా ప్రత్యేక నిఘా పెట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రతి రోజూ స్వదేశంతో పాటు వివిధ దేశాలకు చెందిన ప్రయాణికులు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుండడంతో ఎయిర్‌పోర్ట్‌తో పాటు దాని పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసు బలగాలతో పాటు నిఘా సంస్థలు, ఇంటెలిజెంట్ విభాగం, స్పెషల్ బ్రాంచ్, బాంబు స్క్వాడ్, క్లూస్ టీమ్స్, డాగ్ స్క్వాడ్, తదితర అన్ని విభాగాలు రంగంలోకి దిగినట్లు సమాచారం. విపత్కర పరిస్థితులు ఎదురైతే అవలంభించాల్సిన చర్యలపై వ్యూహరచన చేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. అనుమానితులపై ప్రత్యేక నిఘా పెట్టడంతో పాటు కమిషనరేట్ సరిహద్దు ప్రాంతాలు, సున్నిత, ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు.

### ఐటీ కారిడార్ వద్ద..

వందల సంఖ్యలో ఐటీ కంపెనీలు ఉన్న గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్‌సిటీ, ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ తదితర ఐటీ కారిడార్‌పై నిఘా వర్గాలు ప్రత్యేక దృష్టి పెట్టాయి. కారిడర్ మొత్తాన్ని భద్రతా పరంగా క్షుణ్ణంగా పర్యవేక్షిస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఎలాంటి విపత్తులు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కొనేలా భద్రతా బలగాలు అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

### అందాల పోటీల నేపథ్యంలో..

అందాల పోటీల నేపథ్యంలో వివిధ దేశాల నుంచి వచ్చిన అందాల భామలు బస చేసే హోటళ్లు, వారు పర్యటించే ప్రాంతాలు, ప్రయాణించే మార్గాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. పోటీలు జరిగే గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



# 1971లో ఏం జరిగిందంటే!

ప్రజలను సన్నద్ధం చేసేందుకు మోగించిన సైరన్స్ ● విపత్కర పరిస్థితులపై అవగాహన

**సిటీ బ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ):**

భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. పాకిస్థాన్ కవ్వింపు చర్యలను ఇండియా సమర్థవంతంగా తిప్పికొడుతున్నది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో యుద్ధం జరిగితే హైదరాబాద్ నగరంపై ఎలాంటి ప్రభావం ఉంటుందోనని అనుమానాలు అందరిలో ఉంటాయి. 1971లో పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విముక్తి పోరాటానికి మద్దతివ్వడం వల్ల యుద్ధం అనివార్యమైంది. ఈ నేపథ్యంలో భారత్-పాక్ మధ్య యుద్ధం జరిగింది. ఆ సమయంలో హైదరాబాద్‌లో హైఅలర్ట్ జారీ చేశారు. యుద్ధ ప్రభావం ప్రత్యక్షంగా లేకపోయినా ప్రజలను సన్నద్ధం చేసేందుకు ఎయిర్ రైడ్ డ్రిల్స్ నిర్వహించి, ఎయిర్ రైడ్ సైరన్లు మాత్రం మోగించారు. ఈ ప్రక్రియ యుద్ధం జరిగినన్ని రోజులూ కొనసాగించారు. పాకిస్థాన్ బలగాలు హైదరాబాద్‌పై దాడి చేసే పరిస్థితులు ఏర్పడితే సురక్షితంగా ఎలా బయటపడలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడిన ఎదుర్కొనేందుకు ప్రజలను మానసికంగా సిద్ధం చేశారు. నిత్యం సైరన్లు మోగడం, ఎయిర్ డ్రైవ్ డ్రిల్స్ జరగడం వల్ల అప్పటి ప్రజలు ఒకింత ఆందోళనలకు గురైనా.. భద్రతా బలగాలు వారికి పరిస్థితులను వివరించి ఎలాంటి దాడులు జరగవని భరోసా కల్పించారు. 1971 యుద్ధ ఆనవాళ్లు నగరంలో లేకపోయినా అప్పటి పరిస్థితులు ప్రజలకు ఇంకా గుర్తున్నాయి. మన ప్రాంతం నుంచి అనేక మంది జవాన్లు, ఆర్మీ అధికారులు అప్పటి యుద్ధంలో పాల్గొన్నారు. పాకిస్థాన్‌పై యుద్ధం గెలుపొందడంలో కీలక పాత్ర పోషించారు.

### యుద్ధ ఖైదీల క్యాంపులు..

1971 యుద్ధంలో 93 వేల మంది పాకిస్థాన్ సైనికులను ఇండియా యుద్ధ ఖైదీలుగా అదుపులోకి తీసుకుంది. వీరందరినీ ఉంచడానికి దేశవ్యాప్తంగా క్యాంపులు ఏర్పాటు చేసింది. ఈ క్యాంపులను పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాలకు దూరంగా ఏర్పాటు చేసి భారత ఆర్మీ ఆధీనంలో ఉంచారు. హైదరాబాద్ కూడా పాక్ సరిహద్దులకు దూరంగా ఉండటం వల్ల ఇక్కడ కొన్ని క్యాంపులను ఏర్పాటు చేసినట్లు తెలుస్తున్నది. కానీ ఇప్పటి వరకు దానిపై ఎలాంటి సమాచారం బయటకు తెలియలేదు. పలువురు ఆర్మీ మాజీ సైనికాధికారులు మాత్రం ఇక్కడ ఏర్పాటు చేసిన పీవోడబ్ల్యూ క్యాంపుల్లో ఖైదీలకు మెరుగైన సౌకర్యాలు కల్పించినట్లు పలు సందర్భాల్లో మాట్లాడినట్లు తెలుస్తున్నది. భారత రక్షణ రంగ కార్యాలయాలు, శిక్షణ కేంద్రాలు నగరంలో ప్రముఖంగా ఉండటం వల్ల ఇక్కడ క్యాంపులను ఏర్పాటు చేసి ఉంటారని పలువురు రిటైర్డ్ ఆర్మీ అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు కూడా భారత్-యుద్ధం అనివార్యమైతే యుద్ధ ఖైదీలను ఇక్కడ ఉంచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.





విజయోత్సవ సంబురాల్లో పాల్గొన్న మాజీ మంత్రి మల్లారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు

# ఉగ్రవాదం అంతం కావాల్సిందే

## ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ

మేడ్చల్,/జవహర్‌నగర్ మే 8 : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు కశ్మీర్‌కు వెళ్లిన పర్యాటకులను కాల్చి చంపడం దారుణమన్నారు. భారత మహిళల నుదుట సిందూరాన్ని తుడిపేసిన ఉగ్రమూకలపై జరిగిన దాడిలో కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండ్ వ్యోమికా సింగ్ నాయకత్వం వహించడం దేశానికే గర్వకారణమన్నారు. వారిని ప్రతి మహిళ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు జాతీయ జెండాను చేత పట్టుకొని, దేశానికి, సైనికులకు అనుకూలంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవీలత, అధ్యాపకులు, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉగ్రవాదాన్ని సహించం..

ఉగ్ర స్థావరాలను భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో తుద ముట్టించడం హర్షణీయమని, ప్రపంచ మానవాళి ఉగ్రవాదాన్ని సహించదని అంతం కావాల్సిందేనని మాజీ మేయర్ మేకల కావ్య అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మేయర్ కావ్య సమక్షంలో జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో సీఎంఆర్ దవాఖాన నుంచి అంబేద్కర్ ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. మాజీ కార్పొరేటర్లు లలితాయాదవ్, సంగీత, బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్‌చారి, సోషల్ మీడియా కన్వీనర్ అహ్మద్‌పాషా, నాయకులు మహేశ్, కాసీం, సిద్ధులు యాదవ్, వెంకటేశ్‌గౌడ్, శోభ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# మంచినీళ్లు వస్తలేవు

ఇందిరమ్మ కాలనీలో తాగునీటి గోస
ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన
చోద్యం చూస్తున్న అధికారులు

శామీర్ పేట్, మే 8 : నెల రోజుల నుంచి తాగునీళ్లు రావడం లేదని ఇందిరమ్మ కాలనీ వాసులు గురువారం ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. నల్లా నీళ్లు రాకపోవడంతో ట్యాంకర్ల నీళ్లు కొనలేక పోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం లాల్ గడి మలక్ పేట్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఎదుట నిరసన చేపట్టారు. ప్రభుత్వం, అధికారుల పాలనపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. లాల్‌గడి మలక్ పేట్ గ్రామంలోనే నీటి సమస్య ఎందుకు వస్తుందని పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డిని గ్రామస్తులు నిలదీశారు. మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం వల్లే తమ గ్రామంలో నీటి సమస్య తలెత్తుతుందని కాలనీ వాసులు తెలిపారు. నెల రోజులుగా ఇందిరమ్మ ఇళ్ల కాలనీకి నీటి సమస్య ఉందన్నారు. సమస్యను వివరిస్తే కాలనీ మొత్తానికి ట్యాంకర్‌ను పంపి చేతులు దులుపు కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పన్నులు, ట్యాక్స్‌లు కట్టకపోతే నల్లా కనెక్షన్ లు కట్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తారని, నీరు సరిగా రావడం లేదని ఫిర్యాదు చేస్తే పట్టించుకునే వారే లేరని వాపోయారు. కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామానికి రావాల్సిన నీళ్లు సరిగా రావడం లేదని, వచ్చిన నీళ్లనే సర్దుబాటు చేస్తున్నామని చెప్పడంతో నిరసన విరమించారు.



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఇందిరమ్మ కాలనీ వాసులు,గ్రామస్తులు